సాక్షి
వరంగల్

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బదిలీ కాని స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో ర్యాలీ నిర్వహించారు. - 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ భుజంగరావు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గుడిసెలు తొలగించాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



గీసుకొండ: మండలంలోని వంచనగిరి శివారు ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వ పక్కన ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో మొక్కలను తొలగించి గుడిసెలు వేసిన వారిపై కేసులు నమోదు చేసి తొలగించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పల్లెప్రకృతి వనాన్ని ఆకస్మికంగా పరిశీలించిన అనంతరం గీసుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ విభాగాన్ని సందర్శించారు. ప్రకృతి వనంను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విశ్వనారాయణ, ఎస్సై వెంకన్నలను ఆదేశించారు. ఉపాధి పనుల రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ ఎస్. వీరేశం, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చెన్నారావుపేట: ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ తెలిపారు. మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు అన్ని రకాలు పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సిబ్బంది ఉన్నారు.

చెక్కుల పంపిణీని అడ్డుకున్న రైతులు

నల్లబెల్లి: మండలంలోని లెంకాలపల్లిలో పంట నష్ట పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం రైతులు అడ్డుకున్నారు. లెంకాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రైతులకు మంజూరైన 265 చెక్కులను పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పంపిణీ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని తమకు పంట నష్ట పరిహారం మంజూరు కాలేదని, మరికొందరు తమకు తక్కువగా వచ్చిందని కార్యదర్శిని నిలదీశారు. వ్యవసాయాధికారులు రావాలని పట్టుపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని, చెక్కుల పంపిణీకి సహకరించాలని కార్యదర్శి రైతులను కోరారు. అయినా వినకుండా పంచాయతీ కార్యదర్శితో రైతులు వాగ్వాదానికి దిగారు. దీంతో జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేశాడు. వారి సూచనల మేరకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేశాడు.

4,08,491 మందికి కంటి పరీక్షలు



గీసుకొండ: జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం ముందుకు సాగుతోంది. జిల్లాలో జనవరి 19న ఈ కార్యక్రమం ప్రారంభం కాగా మంగళవారం నాటికి 4,08,491 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇప్పటి వరకు 55,415 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసులు 36,087 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా 23,053 మందికి పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె. వెంకటరమణ తెలిపారు. మొత్తం 3,17,056 మంది కంటిచూపు సమస్య లేనివారుగా గుర్తించారు. జిల్లాలో మొత్తం 324 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు 254 గ్రామాల్లో కంటి పరీక్షల శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు చేయడం పూర్తి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

'ఓపెన్' పరీక్షలు షురూ

కాశిబుగ్గ సెంటర్: సార్వత్రిక విద్య ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షలకు ఉదయం టెన్త్ పరీక్షకు 404 మంది విద్యార్థులకు గాను 361 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 680 మందికి గాను 610 మంది విద్యార్థులు హాజరై 70 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షకు 29 మందికి గాను 26 మంది విద్యార్థులు హాజరై ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు డీఈఓ తెలిపారు.

సమీకృతం సుదూరమేనా!

- ఎన్నికలు సమీపిస్తున్నా.. ఇప్పటికీ లేని ప్రభుత్వ పాలనభవనం
- ఆజంజాహి భూమి కేటాయించినా.. మొదలుకాని నిర్మాణ పనులు
- భూ వివాదం పరిష్కారమైనా.. నిర్మాణ పనులకు నిధుల మంజూరులో అనాసక్తి



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పరిపాలన సేవలకు శాశ్వత పరిపాలన భవన నిర్మాణం విషయంలో అడుగు ముందుకుపడలేదు. మార్చి 9వ తేదీన చేనేత జౌళి శాఖకు చెందిన ఆజంజాహి మిల్లులోని 20.32 ఎకరాల భూమిని రెవెన్యూ విభాగానికి బదిలీ చేసేందుకు అనుమతినిచ్చినా.. ఇప్పటివరకు నిర్మాణ పనుల విషయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఇప్పట్లో ‘సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం’ కట్టడం సుదూరమేనన్నా మాటలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ దీన్ని పట్టించుకునే నాథుడు కరువవడంతో జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజలు కూడా కలెక్టరేట్‌తో సహా ఏ విభాగంలో పని ఉన్నా హనుమకొండలోని వివిధ కాలనీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ముఖ్యనేతలు కూడా వారి వారి నియోజకవర్గాలపైనే దృష్టి సారించడంతో శాశ్వత కలెక్టరేట్ భవనం విషయం అటకెక్కిందన్న టాక్ వస్తోంది. ఇప్పటికైన త్వరగా ఇతర జిల్లాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మాదిరిగానే ఇక్కడా కూడా ఉండేలా చూడాలని ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదం పరిష్కారం..

ఉమ్మడి వరంగల్ పునర్విభజనలో భాగంగా జిల్లా కేంద్రం లేకుండా ఏడేళ్ల క్రితం వరంగల్ రూరల్ జిల్లా ఏర్పడింది. ఒకానొక దశలో పరకాల, నర్సంపేట జిల్లా కేంద్రం కావాలనే డిమాండ్లు తెరపైకి వచ్చినా అడుగు ముందుకు పడలేదు. 2021 సెప్టెంబర్‌లో వరంగల్ అర్బన్‌ను హనుమకొండ, వరంగల్ రూరల్‌ను వరంగల్‌గా మారుస్తూ సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2021 డిసెంబర్‌లో ఆజంజాహి మిల్లులో 6.16 ఎకరాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంతో పాటు 2.32 ఎకరాల్లో చేనేత జౌళి డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. అప్పటికే ఆజంజాహి మిల్లు రిటైర్డ్ కార్మికులు ఆజంజాహి మిల్స్ మాడిఫైడ్ వలంటరీ రిటైర్డ్ 2002 ఈయర్ ఆఫ్ వర్కర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలా హైకోర్టులో పలు వాదనలు జరిగాక సుప్రీం కోర్టుకు వెళ్లాలని చెప్పడంతో 2019లో ఫిబ్రవరిలో వెళ్లారు. దీనిపై వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్ 15న మిల్లు భూములపై స్టేటస్ కో ఇచ్చింది. తాజాగా అర్హులైన కార్మికులకు ప్లాట్లు కేటాయించాలంది. 2023 జనవరి 18న 318 మంది ఉద్యోగులకు హసన్‌పర్తి మండలంలో కుడా అభివృద్ధి చేసి మేడిపల్లి, అనంతసాగర్‌లో ప్లాట్లను కేటాయించామని కుడా వైస్ చైర్మన్ తెలపడంతో వివాదానికి తెర పడింది. 2023 మార్చి 9న వరంగల్ మండలం లక్ష్మీపురంలోని 62, 63, 65, 66, 67, 68, 71, 76, ఖిలావరంగల్ మండలంలోని 368, 370, 371, 372, 373, 374, 375, 376, 377 సర్వే నంబర్‌లలోని 20.32 ఎకరాల చేనేత జౌళి శాఖ రెవెన్యూ విభాగానికి బదిలీ చేసేందుకు సర్కార్ అనుమతినిచ్చింది. ఇది జరిగి నెలన్నర కావస్తున్నా ‘ఇంటిగ్రెటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్’ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో జిల్లాలో చర్చ జరుగుతోంది. ఈ అంశం ఎన్నికల వేళలోనూ రాజకీయంగా విమర్శలొచ్చే అవకాశం ఉందన్న టాక్ ఉంది. ‘కలెక్టర్ గోపి ఉండగానే ఈ స్థలం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత వచ్చిన కలెక్టర్ ప్రావీణ్య ఈ ‘ఇంటిగ్రెటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్’ నిర్మాణం విషయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులను సమన్వయం చేయడం లేదని ప్రభుత్వ వర్గాలే అంటున్నాయి. ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు అంటున్నారు.

శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణోత్సవం

- సింహవాహనం, గజవాహనంపై ఊరేగింపు



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి శంకర జయంతి సందర్భంగా నిత్యాహ్నికం పూర్తి చేసి శంకరభగవత్పాద సమారాధన జరిపారు. అనంతరం చతుస్థానార్చన నిర్వహించి అమ్మవారిని దుర్గదేవిగా అలంకరించి సింహ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం గజవాహనంపై ఊరేగించారు. గ్రేటర్ వరంగల్ ఆర్యవైశ్య సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడు గందె నవీన్, కల్పన దంపతులు, సభ్యులు పాల్గొన్నారు. రాత్రి శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ అద్వైత వేదాంతశాస్త్ర పండితులు మంగళంపల్లి వేణుగోపాలశర్మ శివకల్యాణ వైభవంపై పురాణ ప్రవచనం చేశారు. ఆలయ ఈఓ శేషు భారతి పర్యవేక్షించారు. రాత్రి 11 గంటల వరకు కల్యాణ వేడుకలు కొనసాగాయి. భక్తులకు ఉచిత భోజన ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, ఏసీ రామల సునీత తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ సెంటర్: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు 2023–24 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రులు కోల్పోయిన (అనాథ) బాలికలు మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మాచర్ల శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 240 సీట్లను గాను 70 శాతం సీట్లు అనాథ బాలికలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల బాలికలు హన్మకొండ కాకాజీ కాలనీలోని బాలరక్షాభవన్‌లో దరఖాస్తు ఫారం పూర్తి చేసి కులం, ఆదాయం, బోనాఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌ఫొటోలు జతచేసి మే 10వ తేదీలోపు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8464988186 లేదా 9676096183 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని దివ్యాంగులకు అందించే ఉపకరణములను పంపిణీ చేసేందుకు దరఖాస్తుల గడువును మే 5వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఇంటర్మీడియట్, ఆపై ఉన్నత చదువులు చదువుతున్న అర్హులైన దివ్యాంగులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్ఓబీఎంఎంఎస్. సీజీజీ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



నర్సంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది



వర్ధన్నపేట: జెండావిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరూరి

- ప్లీనరీలో ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్

నర్సంపేట: నిరుపేదల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్ద పీట వేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ప్లీనరీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో రూ.11కోట్లతో పంట నష్టపరిహారాన్ని అందించామని, ఇటీవల కురిసిన కురిసిన వర్షాలకు రూ.38 కోట్ల పంట నష్టాన్ని త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం 32 మంది సభ్యులతో 16 తీర్మాణాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, నల్ల మనోహర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మురళీధర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే అరూరి

వర్ధన్నపేట: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట నియోజకవర్గ ప్లీనరీ సమావేశాన్ని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తదుపరి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మొత్తం రూ.4124.67 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అంతకు ముందుగా పలు తీర్మాణాలు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

- 'కంటివెలుగు' ఆపరేషన్ల కోసం నిరీక్షణ
- జిల్లాలో 29,962 మందికి అవసరం
- ప్రభుత్వానికి నివేదించామంటున్న అధికారులు
- వృద్ధులకు తప్పని తిప్పలు



కంటి వైద్య పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే (ఫైల్)

నల్లబెల్లి: గ్రామాల్లో కంటి చూపుతో బాధపడుతున్న 18 ఏళ్లు పైబడిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి దగ్గర, దూరపు చూపు కళ్లద్దాలు, అవసరమైనవారికి ఆపరేషన్లు, మందులను ఉచితంగా అందిస్తామని గొప్పగా ప్రచారం చేశారు. కానీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలోపంతో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మూడు నెలలు పూర్తయిన బాధితులు కంటి ఆపరేషన్ కోసం ఎదరు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కరికి కూడా కంటి ఆపరేషన్ చేయలేదు.

కంటి ఆపరేషన్ల ఊసే లేదు

జిల్లాలో జనవరి 19వ తేదీన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వచ్చే జూన్ 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఇప్పటివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 4,03,311 మందికి పరీక్షలు నిర్వహించారు. దగ్గరి చూపు సమస్యతో బాధ పడుతున్న 55,155 మందిని గుర్తించి అద్దాలను అందించారు. మరో 35,852 మందికి అద్దాల కోసం ఆర్డర్ చేశారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమై మూడు నెలలు పూర్తయిన కంటి ఆపరేషన్ల ఊసే ఎత్తడం లేదని బాధితులు వాపోతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన గద్దె వీరమ్మ. ప్రభుత్వం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తుందనే ఆశతో కంటి వెలుగు వైద్య శిబిరానికి వెళ్లి పరీక్షలు చేయించుకుంది. రెండు కళ్లకు ఆపరేషన్ అవసరముందని వైద్యులు తెలిపారు. కాని ఇప్పటివరకు కంటి ఆపరేషన్ చేయలేదు. ఇలాంటి దుస్థితి వీరమ్మది ఇక్కరిదే కాదు.. 29,962 మంది కంటి ఆపరేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.


ఆదేశాలు రాలె..



జిల్లాలో ఇప్పటి వరకు 29,962 మంది కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఆపరేషన్లు చేయాలని గుర్తించాం. ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ గోపాల్ రావు, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి

బంజారా సంస్కృతిని భావితరాలకు అందించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

సంగెం: బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ సీతారాం నాయక్ అన్నారు. మంగళవారం సంగెం మండలంలోని వీఆర్ఎన్ తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ మహా బోగ్ బండార్‌ను ఉత్సవ కమిటీ చైర్మన్ గుగులోత్ అవినాష్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల భాషకు లిపి లేక చరిత్ర గ్రంథాల్లో రాయబడకపోవడంతో తరాలకు తెలియకుండా పోతుందన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో నడిచి పూజించడమే ఆయన నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు జాతోత్ హుస్సేన్, మామునూర్ పీటీసీ సీఐ కాశిరాం, మహబూబాబాద్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌నాయక్, ఓయూ గిరిజన రాష్ట్ర నేత డాక్టర్ బానోత్ సంజీవ్‌నాయక్, ఆర్‌సీసీ ఫౌండర్ రేవంత్ రాథోడ్, తండా వాసులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ప్రభుత్వం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చెక్కు అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొంగ సంతోష్ ఇటీవల మృతిచెందగా బీఆర్ఎస్‌కు చెందిన రూ. 2 లక్షల సభ్యత్వ బీమా చెక్కును దేవరుపులలో జరిగిన ప్లీనరీలో మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, సురేందర్ రావు, పూస మధు, నర్సయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం



మాట్లాడుతున్న నాడెం శాంతికుమార్

నర్సంపేట రూరల్: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ అన్నారు. మంగళవారం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో సిట్ అధికారులను కలిసేందుకు వెళ్తున్న వైఎస్ షర్మిలను అడ్డుకోవడం శోచనీయమన్నారు. పోలీసుల అతి ప్రవర్తన నేపథ్యంలో ఆత్మరక్షణలో భాగంగా వ్యవహరించిన షర్మిలను అరెస్టు చేయడం అరాచక పాలనకు నిదర్శనమన్నారు. రాజన్న సతీమణి విజయమ్మను కూడా పోలీసులు అవమానించడం చూస్తుంటే ఆటవిక పాలనను తలపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మండల అధ్యక్షుడు నూనె నర్సయ్య, నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జ్ జిల్లపెల్లి దినేష్, గట్టయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి



వీసీలో మాట్లాడుతున్న క్యాబినెట్ సెక్రటరీ

వరంగల్: కాజీపేట నుంచి విజయవాడ 3వ రైల్వే లైన్, మంచిర్యాల నుంచి వరంగల్–ఖమ్మం, నాగపూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించ తలపెట్టిన నేషనల్ హైవే భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ అన్నారు. మంగళవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా క్యాబినెట్ సెక్రటరీ ఢిల్లీ నుంచి రైల్వేలైన్, నేషనల్ హైవే భూసేకరణ పనులపై వీడియో కాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మూడో రైల్వే లైన్, నేషనల్ హైవే భూ సేకరణ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ వీసీలో కలెక్టర్ ప్రావీణ్య, శ్రీవత్సకోట పాల్గొన్నారు.

డిగ్రీ 'ఇయర్ వైజ్' దరఖాస్తు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీకోర్సుల ఇయర్ వైజ్ బ్యాక్‌లాగ్, ఎక్స్ విద్యార్థుల పరీక్ష దరఖాస్తులు సమర్పించే గడువు మే 1వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విశ్వవిద్యాలయం అకాడమిక్ బ్రాంచీలో ఒక్కో సబ్జెక్టుకు రూ.3వేల చొప్పున ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతోపాటు సబ్జెక్టుకు రూ.4వేల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

మత్స్యకారుల సభ్యత్వ నమోదు



వల పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో మంగళవారం మత్స్యకారుల నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో వలలు వేయడం, ఈదడం వంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి నరేష్‌నాయుడు, సునీత, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బుస్స మల్లేశం, ముదిరాజ్ కులస్తులు కత్తి సోమన్న, పిట్టల వెంకటయ్య, మోతె అంజయ్య, కత్తి సత్తయ్య, రాజాలు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భట్టి యాత్ర

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం వరంగల్ నగరంలో సాగింది. ఉదయం కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులతో కొంతసేపు ముఖాముఖి నిర్వహించిన భట్టి.. సాయంత్రం కేయూ జంక్షన్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకున్నారు.

- వివరాలు 8లో▸



నగరంలో పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాకు బహుమతిగా ఇద్దాం

- కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కాజీపేట/మడికొండ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌నుంచి ప్రారంభమై గోపాలపురం క్రాస్‌రోడ్డు, సమ్మయ్యనగర్ మీదుగా గోకుల్‌నగర్, కలెక్టరేట్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కేసీఆర్‌ను ఓడించాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులను కోల్పోయి ఆచేతనంగా మిగిలిన రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో రాత్రి బస

భట్టి యాత్ర రాత్రి 9.30 గంటలకు మడికొండకు చేరుకుంది. వాసవిమాత కల్యాణ మంటపంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అక్కడినుంచి పాదయాత్ర ద్వారా మడికొండ చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరినుంచి ధర్మసాగర్ మండలానికి వెళ్తారని పార్టీ నేతలు తెలిపారు.

కేసీఆర్ కుట్ర

ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు

- ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వీర్యం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కేయూలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి
- కష్టాలు, సమస్యలు చెప్పుకున్న విద్యార్థులు



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేయూ క్యాంపస్: కొట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్‌కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలువురు నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే మాకు ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీచేయలేదన్నారు. చివరికి ఇచ్చిన నోటిఫికేషన్లలో పేపర్ల లీకేజీతో పలు నోటిఫికేషన్లు రద్దుచేశారని అన్నారు. తాము కుటుంబాలకు దూరంగా ఉండి కష్టపడి చదుకుంటున్నామని యూనివర్సిటీల ప్రైవేటీకరణ, గ్రూప్ పేపర్ల లీకేజీ, గురుకుల పోస్టుల ఉద్యోగాల రిజర్వేషన్ల ఇబ్బందులు సమస్యలను విద్యార్థులు సీఎల్పీ నేత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ ఒక పెద్ద వర్సిటీగా, ఎన్నో ఉద్యమాలకు, భావజాలాలకు, సామాజిక మార్పులకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా 70 ఏళ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నీళ్లు లేవు.. నిధులు లేవు.. నియామకాలు లేకుండా చేశారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేరేవరకూ విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీని కూడా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలను మాత్రం ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.5లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని యూనివర్సిటీల భూములను కూడా అమ్మేస్తాడని ఎద్దేవా చేశారు. త్వరలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తానని చెప్పారు. పేపర్ లీకేజీలు చేసినా.. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, శోభ, రవళిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేయూ విద్యార్థి జాక్ కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, ఆలువాల కార్తిక్, బొట్ల మనోహర్, బండి రాకేష్, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, హెచ్ భగత్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఐలేష్, మధుకర్‌రావు, మంద నరేష్ ఇట్టబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కచ్చితమైన వాటా ఇవ్వాలి



గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులలో 75శాతానికిపైగా మహిళలకే కేటాయించారు. పురుష అభ్యర్థులు నష్టపోతున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. వారి కోటా వారికి ఇవ్వాల్సిందే. అదే విధానాన్ని చట్టసభల్లో కూడా కేసీఆర్ అమలు చేయాలి.

- రాజశేఖర్, నిరుద్యోగ విద్యార్థి

రూ.5 భోజనం తింటూ చదువుతున్నాం



విద్యార్థుల లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం లక్షలకు అమ్ముకుంటోంది. రూ.5 భోజనం తింటూ.. చదువుకుని ఉద్యోగాలకు ప్రిపేరవుతున్నాం. రోస్టర్ పాయింట్లు చూస్తుంటే దడ పుడ్తోంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. కానీ పురుషుల కోటా మాత్రం కచ్చితంగా అమలు చేయాలి.

- దోంగ్రూ కచ్రూ, నిరుద్యోగ విద్యార్థి

నిట్‌లో కొలువుల సంబురం



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్, ఎన్వీ.రమణారావు

- ఉద్యోగ సాధనకు నిట్ అక్షయపాత్ర
- టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్
- 268 కంపెనీల్లో 1,410 మందికి ఉద్యోగాలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కొలువుల సంబురం మంగళవారం అంబరాన్నంటింది. నిట్ వరంగల్‌కు చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అక్షయ క్యాంపస్ సెలక్షన్స్ సక్సెస్ మీట్‌ను టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి, మాట్లాడారు. తాను నిట్ వరంగల్‌లోనే బీటెక్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించి నేడు టెక్ మహీంద్రా కంపెనీకి సీటీఓగా పని చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ విద్యకు, అత్యుత్తమ ఉద్యోగ సాధనకు నిట్ వరంగల్ క్యాంపస్ అక్షయపాత్ర లాంటిందని కొనియాడారు. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు నిట్ వరంగల్ గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని తెలిపారు. నిట్ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు సీసీపీడీ(సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రపంచంలోని కంపెనీలు పోటీపడుతున్నాయని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిట్‌కు చెందిన ఆదిత్య సింగ్ రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలక్ట్ అవ్వడమేనని అన్నారు. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించిన 1,410 మంది విద్యార్థులకు సీసీపీడీ క్యాంపస్ సెలక్షన్స్ పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీసీపీడీ హెచ్ డేవిడ్‌సన్, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధనతోనే మంచి ప్యాకేజీ..



న్యూఢిల్లీలోని ఫరీదాబాద్ నుంచి నిట్ వరంగల్‌లో బీటెక్ సీఎస్ఈ కోసం వచ్చా. ఇక్కడి విద్యార్థుల పోటీతత్వంతో ప్రేరణ పొందాను. నిట్ అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో తోస్పాట్ బెంగళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను.

- ఆదిత్య సింగ్, సీఎస్ఈ, రూ.88లక్షల ప్యాకేజీ

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ లక్ష్యం



నేను వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేస్తాను. నిట్‌లో ఎంఎస్సీ మాథ్స్ పూర్తి చేశాను. పూనేలోని సిటీ బ్యాంక్‌లో రూ.12లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను. కంపెనీ పెట్టి మరింతమందికి ఉద్యోగాలివ్వడమే నా లక్ష్యం.

- తానీయా అగర్వాల్, ఎంఎస్సీ (మ్యాథ్స్), రూ.12లక్షల ప్యాకేజీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా..



నిట్ వరంగల్‌లో సీఎస్ఈ విభాగంలో బీటెక్ చదువుతున్న తరుణంలోనే సీసీపీడీ చొరవతో క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాను. హైదరాబాద్‌కు చెందిన డీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.62.5లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉంది.

- సుషీత్‌రెడ్డి, సీఎస్ఈ, రూ.62.5లక్షలు

యూఎస్‌లో మాస్టర్స్ చేస్తా..



యూఎస్‌లో మాస్టర్స్ చేయడమే నాలక్ష్యం. నిట్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేస్తూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నాను. మా ప్రొఫెసర్స్ గైడెన్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్వాల్‌కామ్ కంపెనీలో రూ.29.7లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం సంతోషంగా ఉంది.

- రుచీరా, ఈఈఈ, రూ.29.7లక్షల ప్యాకేజీ

ఉపేందర్ మృతదేహంతో ధర్నా

- మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్
- విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఎస్ఈ హామీ



మృతదేహంతో రాస్తారోకో నిర్వహిస్తున్న, బంధువులు, అఖిలపక్ష నాయకులు

గార్ల: విధి నిర్వహణలో భాగంగా విద్యుదాఘాతానికి గురై సోమవారం రాత్రి మృతిచెందిన వాంకుడోత్ ఉపేందర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట అఖిలపక్షం నాయకులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో గార్ల నుంచి పోచారం వెళ్లే వాహనదారులకు మూడు గంటపాటు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు చేరుకుని జిల్లా విద్యుత్ శాఖ అధికారులను గార్లకు రప్పించారు. పరిహారం చెల్లింపుపై బాధిత కుటుంబ సభ్యులు అఖిలపక్షం నాయకులతో జిల్లా ఎస్ఈ నరేష్, డీఈ విజయ్, ఏడీఈ రమేష్‌లు కలిసి చర్చలు జరిపారు. విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు, విద్యుత్ శాఖ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ నుంచి రూ.20లక్షలు, ఉపేందర్ కుమారుడికి కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని జిల్లా ఎస్ఈ నరేష్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గార్ల సబ్‌స్టేషన్ ఎదుట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ బాలాజీ నేతృత్వంలో ఎస్సైలు బానోత్ వెంకన్న, రమాదేవి పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ జ్యోతి, అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టెబోయిన శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు, జంపాల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

- హనుమకొండ, వరంగల్‌లో వంద శాతం హాజరు
- టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 90 శాతం హాజరు



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లోని రెండు జేఏసీలతో వేతన సవరణ ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఈ రెండు యూనియన్లు యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చాయి. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాయి. కానీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. మరో వైపు విద్యుత్ సంస్థల్లో సమ్మెను నిషేధాన్ని విధించింది. ఆర్టిజన్‌లు సమ్మెకు వెళ్తే ఎస్మా కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. ఈ క్రమంలో సమ్మె సందిగ్ధంలో పడ్డది. ఎక్కడ ఎస్మా ప్రయోగించి చర్యలు తీసుకుంటారో.. ఎక్కడ ఉద్యోగాలు ఊడిపోతాయోననే భయాందోళన మధ్య బలవంతంగా ఆర్టిజన్లు హాజరయ్యారు. ప్రధాన సంఘాల మద్దతు లభించకపోవడం కూడా ఆర్టిజన్లు వెనక్కు తగ్గడానికి కారణమని పలువురు ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉన్నారు. ఈ రెండు జిల్లాలో వంద శాతం హాజరయ్యారని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు, వరంగల్ జిల్లాలో 183 మంది ఆర్టిజన్ ఉద్యోగులుండగా అందరు విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వంద శాతం హాజరుతో జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. కాగా, టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 90శాతం ఆర్టిజన్లు విధులకు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించిందని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ భవన్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా వారి వివరాలు తెసుకున్నాకే లోపలికి అనుమతించారు.

బతుకుదెరువు కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు



ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల : బతుకు దెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తాత చనిపోగా, మనుమడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట- జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వరిధాన్యాన్ని కుప్పగా చేస్తూ కుప్పకూలిన రైతు

- చికిత్స పొందుతూ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి దగ్గరికి చేస్తుండగా కుప్పకూలి పడిపోయిన ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన రిక్కల వెంకట్‌రెడ్డి(60) తన వరి ధాన్యాన్ని అమ్మేందుకు గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించి ఎండకు ఆరబెట్టాడు. ఈనెల 23న(ఆదివారం) సాయంత్రం వర్షం రావడంతో ధాన్యాన్ని దగ్గరగా కుప్ప చేసే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్పౌజ్ టీచర్లు

- హనుమకొండలో ర్యాలీ నిర్వహించిన టీచర్లు

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇంకా బదిలీ కాని స్పౌజ్ టీచర్లు తమకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లా.. భార్య మరొక జిల్లాలో ఉంటూ అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలలుగా నిరీక్షిస్తున్నామని తమ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేసినప్పటికీ మిగిలిన అందరినీ బదిలీ చేయాలని కోరారు. అలాగే ఎస్‌జీటీ కేటగిరి స్పౌజ్ టీచర్లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టలేదని తమ ఆవేదనను ప్లకార్డుల వెలిబుచ్చారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రంను సమర్పించారు. ఈసందర్భంగా స్పౌజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ మాటను నిలుపుకోవాలని కోరారు. వేణుగోపాల్, శ్రీనివాసస్వామి, శ్రీహరి, శరత్, రాంగోపాల్‌రెడ్డి, హుస్సేన్, రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌసియా, హేమలత, శ్రీపాల్, నరిసయ్య, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డీఎస్ భుజంగరావు



నూతన కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ (డీఎస్) డి.భుజంగరావు అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచీ 10వ జనరల్ బాడి, నూతన కార్యవర్గం ఎంపికలో భుజంగరావు మాట్లాడారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో రైల్వే డ్రైవర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే డీఎంఓ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు ఆరోగ్యంగా జాగత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైల్వే సంఘ్ ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.రవి, వర్కింగ్ చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా శృతి, జి.లక్ష్మీయనారాయణ, గుప్తా, సెక్రటరీగా చింత మురళి, అసిస్టెంట్ సెక్రటరీలుగా జి.వరప్రసాద్ రెడ్డి, మేరుగు శివ, సీహెచ్.పరమేశం, ట్రెజరర్‌గా పి.సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు వి.మురళీకృష్ణ, ఎస్.వెంకటనారాయణ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.